


అంగన్వాడీలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కనీసవేతనాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని బకాయిలు చెల్లించాలని కోరుతూ 2017 సెప్టెంబర్‌లో కలెక్టరేట్ వద్ద ధర్నా చేసిన అంగన్‌వాడీ యూనియన్ నాయకులపై పోలీసులు పెట్టిన కేసును గురువారం కోర్టు కొట్టివేసింది. అనుమతి లేకుండా ధర్నా చేయటం నేరమని విజయనగరం వన్ టౌన్ పోలీసులు సిఐటియు నాయకులపైనా, అంగన్వాడీలు 20మందిపై కేసు పెట్టారు. నాలుగేళ్లగా కేసు విచారణ జరుగుతోంది. పోలీసులు పెట్టిన కేసు సరైనది కాదని, వారు నేరం చేసినట్లుగా రుజువు కాలేదని చెబుతూ మొబైల్ కోర్టు జడ్జి తీర్పుచెప్పారు. ఈ సందరర్భంగా సిఐటియు నాయకులు టివి రమణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పైడిరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



బంటుపల్లిలో ఘర్షణకు దిగిన టిడిపి, వైసిపి గ్రూపులు

బంటుపల్లి పాఠశాలలో ఘర్షణ

గుర్ల : మండలంలోని బంటుపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నిక సందర్భంగా టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరు గ్రూపుల నాయకులు కొట్లాటకు దిగడంతో హెచ్ఎం శ్రీనివాసరావు ఎన్నికను వాయిదా వేశారు.

ఒకట్రెండు చోట్ల మినహా

ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతం

1799 స్కూళ్లకు 1749 చోట్ల ఎన్నికలు ● 50 పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 1799పాఠశాలలకు గాను 1749 చోట్ల ఎన్నికలు జరిగాయి. 50 పాఠశాలల్లో కోరం లేక వాయిదా పడ్డాయని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. పాఠశాలల్లో ముందుగా తరగతి వారీగా ముగ్గురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారంతా చైర్మన్;వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. పలుచోట్ల ఘర్షణలు జరిగే అవకాశమున్నందున ముందుగా పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక జరిగింది. విజయనగరంలోని కంటోన్మెంట్ హైస్కూల్‌లో పోలీసుల సమక్షంలో ఎన్నిక జరిగింది. ఎన్నిక వీడియో చిత్రీకరణ చేసి ఎటువంటి సమస్య తలెత్తకుండా పూర్తి చేశారు.

గజపతినగరం : మండలంలోని 55 పాఠశాలలకు గాను 53 చోట్ల ఎస్ఎంసి ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రామన్నపేట ప్రాథమిక, కెంగువ ప్రాథమికోన్నత పాఠశాలల్లో కోరం చాలక ఎన్నికలు వాయిదా పడ్డాయి.

రేగిడి : మండలంలోని తునివాడ, చిన్న చిర్లాం, సోమరాజుపేట, మునకలవలస గ్రామాల పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎంఇఒలు ఎం వరప్రసాదరావు, ఎరకయ్య తెలిపారు. తునివాడ, చిన్నశిర్లాం, మునకలవలసలో కోరం లేక వాయిదా పడ్డాయి. సోమరాజుపేటలో ఎన్నికలు పూర్తయినప్పటికీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల పేర్లు ప్రకటన వాయిదా పడింది.

టిడిపిలోనే పోటీ

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్ద ఉన్న ఎపి ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా సాగింది. ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించిన ఎన్నికలో టిడిపిలో రెండు గ్రూపులు చైర్మన్ కోసం పోటీపడ్డాయి. చివరికి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు సూచనతో ఎస్ఎంసి చైర్‌పర్సన్‌గా ఏడువాక భవాని, వైస్ చైర్మన్ గుడివాడ శ్రీను ఎన్నికయ్యారు. మండలంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ కె.రాజేష్ బందోబస్తు ఏర్పాటుచేశారు.



క్వారీ వద్ద మోహరించిన పోలీసులు



క్వారీలో తవ్వకాలు చేపడుతున్న పొక్లెయినర్

పోలీసు పహారా మధ్య

క్వారీ పనులు

- అర్ధరాత్రి గ్రామ పెద్దలకు బైండోవర్ నోటీసులు
- రామచంద్రపేట వాసులకు సహకరించని నాయకులు
- ఏంచేయాలో తెలియని పరిస్థితుల్లో గ్రామస్తులు

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయాన్ని త్వరతిగతిన పూర్తి చేయాలని దీనికి అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి పూర్తిగా లభిస్తుందని ఇటీవలి పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర విమానాయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు జీఎమ్మార్ సంస్థకు తెలియజేసిన విషయం తెలిసిందే. కాని భవనాలు, రన్‌వే నిర్మాణానికి అవసరమైన పిక్కరాయి అందుబాటులో లేదని కొత్త క్వారీకి గ్రామస్తులు అడ్డుపడుతున్నారని జీఎమ్మార్ సంస్థ నేరుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. దీంతో గత కొన్ని రోజులుగా స్థబ్దతగా ఉన్న జిల్లా యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. గ్రామస్తులు ఎలాంటి ఇబ్బందులు పడినా పర్వాలేదని భారీ పోలీసుల మధ్య జీఎమ్మార్ సంస్థకు బుధవారం సాయంత్రం క్వారీ అప్పజెప్పిన విషయం తెలిసిందే. దీంతో సిఐ ఏ. రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం భారీగా పోలీసులు క్వారీ వద్దకు చేరుకున్నారు. ఈ పోలీసుల పహారా మధ్య జీఎమ్మార్ సంస్థ ఈ క్వారీ పనులను ప్రారంభించింది. దీంతో ఇంత మంది పోలీసులను చూసిన గ్రామస్తులు కూడా క్వారీ వద్దకు వెళ్ళి అడ్డుకునేందుకు వెనక్కి తగ్గారు. ఏం చేయాలో తెలియక మిన్నుకున్నారు. మరో పక్క సంబంధిత పార్టీ నాయకులు కూడా అభివృద్ధిని అడ్డుకుంటే ఎలా అంటు తిరిగి ప్రశ్నిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి బైండోవర్ నోటీసులు జారీ

గ్రామస్తులు క్వారీ పనులను అడ్డుకుంటారనే ఉద్దేశంతో గ్రామంలోని 11మంది గ్రామ పెద్దలపై పోలీసులు తహశీల్దారు ఎం. సురేష్‌తో బైండవర్ కేసులను నమోదు చేశారు. వీటికి సంబంధించిన నోటీసులను బుధవారం అర్ధరాత్రి సి.ఐ రవికుమార్ నేరుగా వెళ్ళి గ్రామ పెద్దలకు అందజేసి నోటీసులపై సంతకాలు తీసుకున్నారు. ఇంత రాత్రి మీద వచ్చి నోటీసులు ఇవ్వడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బైండవర్ కేసులు పెట్టిన తరువాత కూడా క్వారీ పనులను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని గ్రామస్తులను అధికారులు హెచ్చరించడం విశేషం. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఏం చేయాలో తెలియక న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవడుతున్నట్లు సమాచారం. ఎందుకంటే క్వారీ అడ్డుకునేందుకు మరో మార్గం లేనందున పార్టీ నాయకులతో మాట్లాడి తదుపరి నిర్ణయం తీసుకుంటామని అంటున్నారు.

పనులు అడ్డుకుంటే కేసులు

రామచంద్రపేట గ్రామంలో జీఎమ్మార్ సంస్థకు ప్రభుత్వం క్వారీకి అనుమతులను మంజూరు చేసింది. అందుకు గ్రామస్తులను అడ్డుకోవద్దని చెబుతున్నాం. గ్రామపెద్దలపై బైండవర్ కేసులు కూడా నమోదు చేశాం. ఒకవేళ ఎవరైనా అడ్డుకోవాలని ప్రయత్నిస్తే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. **- సిఐ రవికుమార్**

సిపిఎం నేత బుద్ధదేవ్ మృతికి నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పశ్చిమబెంగాళ్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం సీనియన్ నాయకులు బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈమేరకు పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రకటన విడుదల చేశారు. 1996లో విద్యార్థి దశలో పార్టీలో చేరిన ఆయన విద్యార్థి, యువజన ఉద్యమాల్లో, పలు పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. 1968లో పశ్చిమబెంగాల్ డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారని, 1971లో పార్టీ రాష్ట్రకమిటీకి, 1982లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కాలంలోనే ఆయన అంకిత భావంతో వివిధ బాధ్యతలను నిర్వహించే ముఖ్యమైన పార్టీ నేతగా ఎదిగారని పేర్కొన్నారు. 1985లో నిర్వహించిన పార్టీ 12వ మహా సభల్లో కేంద్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారని తెలిపారు. 2000 నుంచి 2015 వరకు పొలిట్‌బ్యూరో సభ్యులుగా కొనసాగారని, పార్టీ విధానాలను రూపొందించడంలో గణనీయమైన కృషి చేశారని తెలిపారు. 2000 సంవత్సరం నవంబర్‌లో పార్టీ సీనియర్ నేత జ్యోతి బసు నుండి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తర్వాత మరో రెండు పర్యాయాలు ఎన్నికయ్యారని తెలిపారు. రచయిత, కవి, నాటకరచయితగానూ ఆయన పేరు సంపాదించారని తెలిపారు.

పింఛనుదారుల సంఘం నాయకులు రాఘవరాజు మృతి



రాఘవరాజు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జిఆర్ రాఘవరాజు గురువారం మృతి చెందారు. ఆయన మృతికి పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు సంతాపం తెలిపారు. రాఘవరాజు మృతి తీరని లోటు అన్నారు.

వినేష్ ఫొగట్ అనర్హతపై నిరసన

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన మానవహారం




మానవహారం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, యువత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేష్ ఫొగట్‌పై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన గురువారం మయూరి జంక్షన్‌లో విద్యార్థులు, యువకులు మానవహారం చేపట్టారు. తౌలుత కాంప్లెక్స్ నుండి మయూరి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ ఇది భారతీయ క్రీడలకు ఎదురుదెబ్బ మాత్రమే కాదు, ఫెయిర్ ప్లే మరియు స్పిరిట్‌పై కఠోరమైన దాడి అని అన్నారు. లక్షలాది భారతీయ యువకుల ఆకాంక్ష అని అన్నారు. వినేష్ ఫోగట్ స్థితిస్థాపకత, ధైర్యం మరియు శ్రేష్ఠత యొక్క తిరుగులేని అన్వేషణకు చిహ్నమన్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో పాతుకుపోయిన అస్వస్థతను బహిర్గతం చేసిన అధ్యాయమన్నారు.మాజీ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ అణచివేత పాలనకు వ్యతిరేకంగా ఆమె ప్రయాణం చారిత్రాత్మక పోరాటంతో ముడిపడి ఉందన్నారు. వినేష్ అనర్హత చుట్టూ ఉన్న పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాత్రపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు.

ఈ విషయంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అధికారుల పాత్రపై సమగ్రమైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. వినేష్ ఫోగట్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంలో క్రీడా సోదరులు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాము, జిల్లా ఉపాధ్యక్షులు చినబాబు, జె .రవికుమార్, సహాయ కార్యదర్శులు సమీరా, రమేష్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సతీష్ , ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, సోమేష్, గుణ, నాగభూషణం, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి దేవానంద్‌తో జిల్లా జడ్జి సాయికళ్యాణ్ చక్రవర్తి

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి దేవానంద్ రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం గురువారం విజయనగరం వచ్చారు. గతంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా వున్న కాలంలో విజయనగరం జిల్లా పోర్టుఫోలియో జడ్జిగా పలు మార్లు ఆయన జిల్లాను సందర్శించారు. జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవానంద్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి సాయి కళ్యాణ్ చక్రవర్తి, పలువురు న్యాయాధికారులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.హరీష్, కార్యదర్శి విజి సంతోష్, సీనియర్ న్యాయవాది కెవిఎన్ తమ్మన్నశెట్టి, న్యాయవాదులు బొడ్డు సత్యనారాయణ, ఎల్ సత్యనారాయణ, ఎస్ ఎస్ ఎస్ ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, జిల్లా ఇన్‌ఛార్జి గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ ఉత్సవానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ముఖ్య అతిధిగా హాజరవుతారని, విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఇతర ప్రముఖులు, పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.



కెంబూరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాజీ ఎంపి కెంబూరికి పలువురి నివాళి

ప్రజాశక్తి-చీపురుపల్లి

టిడిపి నాయకులు, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి పార్లమెంటు మాజీ సభ్యులు కెంబూరి రామ్మోహనరావు (75) మృతికి పలువురు నివాళు లర్పించారు. ఆయన ఇటీవల అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాశ విడిచారు. కెంబూరి రామ్మోహనరావు రేగిడి మండలం దేవుదళ గ్రామంలో 1949లో జన్మించారు. 1984లో తెలుగుదేశం పార్టీలో ఆయన చేరారు. అనంతరం 1985లో జరిగిన శాశన సభ ఎన్నికలలో చీపురుపల్లి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి గెలుపొందారు. 1989లో బొబ్బిలి పార్లమెంటు నియోజక వర్గం నుండి లోక్‌సభకు పోటీ చేసి పూసపాటి ఆనందగజపతిరాజుపై గెలుపొందారు. 1993లో కెంబూరి రామ్మోహనరావు టిడిపి నుంచి సస్పెండ్ అయ్యారు. దీంతో 1994లో కాంగ్రెస్ నుంచి చీపురుపల్లి శాసనసభ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 1999లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓటమి చెందారు. 2003లో తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడ ఇమడ లేక 2008 నవంబర్‌లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అయితే ఆ పార్టీలో ఎంఎల్ఏ టిక్కెట్ దక్కక పోవడంతో రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. కొంత కాలంగా ఆరోగ్యం బాగో లేక ఇంటివద్దనే ఉంటున్నారు. తాజాగా ఆరోగ్య క్షీణించడంతో ఆయన కుటుంబ సభ్యులు విశాఖ పట్నంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య రుషేంద్ర మణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీమంత్రి కిమిడి మృణాళిని కెంబూరికి సోదరి.

రామ్మోహన్‌రావు మృతదేహాన్ని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కెంబూరి మరణవార్త తెలిసిన వెంటనే చీపురుపల్లి చేరుకొని నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంత్రి వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఇతర నాయకులు ఉన్నారు. కెంబూరి మృతికి రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు సంతాపం తెలిపారు.

వక్ఫ్ సవరణ రాజ్యాంగ ధిక్కారణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టడం రాజ్యాంగ ధిక్కార చర్య అని కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ ఎండి హుస్సేన్ షరీఫ్, జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు ఖరీం అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం మైనార్టీలకు రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ హక్కులను కాలరాయడమే అన్నారు. మైనార్టీ హక్కులకు భంగం కలిగిస్తే తాటతీస్తాం అన్న చంద్రబాబు లోకేష్ నోరు విప్పడం లేదన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో టిడిపి మద్దతు తెలపడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. మైనార్టీ హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వానికి, నల్ల చట్టాలకు తెలుగుదేశం మద్దతు తెలపడం సిగ్గుమాలిన తనం అన్నారు ఈ దుశ్చర్యకు నైతిక బాధ్యతగా టిడిపి చెందిన మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు రాజీనామాలు చేయాలని అన్నారు.

జెఎన్‌టియులో చట్ట వ్యతిరేక బదిలీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతిష్టాత్మకమైన జెఎన్‌టియుజివిలో చట్ట వ్యతిరేకంగా బదిలీ చేపట్టారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. గురువారం ఆయన మీడియా తో మాట్లాడుతూ గత ప్రభుత్వం జెఎన్‌టియుకు నిధులు ఇవ్వకుండా, బోధన , బోధనేతర సిబ్బంది నియామకాలు ఏమి చేపట్టకుండా తీవ్రమైన నిర్లక్ష్యానికి గురి చేసిందని తెలిపారు. అంతేకాకుండా బోధన, బోధనేతర సిబ్బందిని చట్ట వ్యతిరేక బదిలీలు చేశారని ఆరోపించారు. 2012లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విజయనగరంకు మాత్రమే నియమితులైన 41 మంది బోధనా సిబ్బందిలో 21 మందిని, ఆరుగురు బోధనేతార సిబ్బందిని దొడ్డి దారిన జెఎన్‌టియు కాకినాడకు బదిలీ చేయడం దారుణమన్నారు. ఈ బదిలీలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

గంజాయి నిర్మూలనకు విస్తృత దాడులు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో గంజాయి, నాటుసారా నిర్మూలనకు విస్తత దాడులు చేపట్టాలని ఎస్‌పి వకుల్ జిందాల్ ఎస్ఇబి అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్ఇబి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో గంజాయి, నాటుసారా మరియు ఇతర మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలను నియంత్రించేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సారా తయారీకి, అమ్మకాలకు అలవాటుపడిన నిందితులను జిల్లా వ్యాప్తంగా గుర్తించి, వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, నాటుసారా అమ్మకాలు, తయారీకి పాల్పడకుండా ఉండేందుకు వారిపై బైండోవరు కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా తయారీ, గంజాయి అక్రమ రవాణాపై క్షేత్ర స్థాయిలో నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో బెల్లం ఊటలను గుర్తించి, ధ్వంసం చేసే కేసుల్లో నిందితులను గుర్తించాలని, వారిపై చర్యలు చేపట్టాలన్నారు. గతంలో గంజాయి, నాటుసారా అక్రమ రవాణలో అరెస్టు కాబడిన నిందితులను విచారణ చేసి, అక్రమ రవాణ మూలాలను గుర్తించి, అందుకు బాధ్యులైన వారిని కూడా ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో బెల్టుషాపులపై అకస్మిక దాడులు నిర్వహించి ఎన్‌ఫోర్సుమెంట్ కేసులు నమోదు చేయాలని ఎస్‌పి ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తిచేసి, కోర్టులో నిందితులపై అభియోగ పత్రాలను దాఖలు చేయాలని ఎస్ఇబి అధికారులను ఎస్‌పి ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి ఆస్మా ఫర్వీన్, అసిస్టెంట్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

గురుదేవ్ సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-కొత్తవలస

వికలాంగుల పట్ల గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని చాటన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి.సీతారామయ్య అన్నారు. గురువారం ఆ ట్రస్ట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ అందిస్తున్న సేవలు వికలాంగులకు మరో వరం లాంటివని, ఇటువంటి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బరజిలై ఫౌండేషన్ సహకారంతో, చేతన్ ఫౌండేషన్ ఫ్రీ ఆర్టిఫిషల్ లింబ్స్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించింది. 50 మంది వికలాంగుల కొలతలు సేకరించారు. కార్యక్రమంలో గురుదేవ్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌బాబు, వైస్ చైర్మన్ డాక్టర్ వి.ఫణీంద్ర, షేక్ రషీద్, చంద్ర కాంత్ నవీన్ పాల్గొన్నారు.



వికలాంగుల కొలతలు సేకరిస్తున్న ట్రస్టు సిబ్బంది


డిఇఒ ప్రేమ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

పాఠశాలలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివి, ఆదర్శ పాఠశాలతోపాటు వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను గురువారం డిఇఒ ప్రేమ్‌కుమార్‌ సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఒ సిబ్బందితో మాట్లాడుతూ ఎస్‌ఎంసి ఎన్నికలను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట శృంగవరపుకోట, వేపాడ ఎంఇఒలు సిహెచ్‌ కూర్మారావు, పి.బాల భాస్కర్‌ రావు, ప్రిన్సిపల్‌ ఆర్‌.ఈశ్వరరావు, ఎస్‌ఒ కిరణ్‌ మై, సిఆర్‌పిలు ఉన్నారు.

అన్న క్యాంటీన్‌ పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రాజాం

పట్టణంలోరని ఆర్‌టిసి కాంప్లెక్స్‌ ఆవరణంలో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న అన్న క్యాంటీన్‌ను గురువారం ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌ అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు త్వరలో క్యాంటీన్‌ పునరుద్ధించి అనార్థులకు ఆకలి తీరుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ఏ రావివలస విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలోని 11కెవి మెయింటినెన్స్‌ పనులు కారణంగా సుమారు 11 గ్రామాలకు విద్యుత్‌ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌ శాఖ గ్రామీణ ఇఇ జీ.సురేష్‌ బాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని అన్నారు. ఏ రావివలస గూడెపువలస, దల్లిపేట, రెడ్డి కంచెరు, బైరెడ్డి పాలెం, ముగడపేట, ఆర్‌.ఆర్‌ కాలనీ, చాకివలస, సన్‌రే విలేజ్‌తో పాటు విమానాశ్రయం ప్రాంతంలో విద్యుత్‌ ఉండదని తెలిపారు. అందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విజయనగరం టౌన్‌ : మండలంలోని చాకలిపేట 11కెవి మెయింటెనెన్స్‌ పనులు జరుగుతున్నందున సుంకరిపేట, మలిచర్ల, చెల్లూరు, బడుకొండపేట, అయోధ్యనగర్‌, ఆర్టీసి కాలనీలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్‌ ఇఇ పి.హరి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు భోగాపురం మండల సమావేశం

భోగాపురం : మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపిడిఒ చంద్రకళ తెలిపారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగునుందని ఆమె తెలిపారు. అందుకు మన స్థాయి అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

'సీతం'లో రెండో రోజు ఇండక్షన్‌ ప్రోగ్రాం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్‌

సీతం ఇంజినీరింగ్‌ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో రోజు ఇండక్షన్‌ ప్రోగ్రాంలో భాగంగా టిసిఎస్‌ -అయాన్‌ జోనల్‌ ఆపరేషన్స్‌ మేనేజర్‌ కె.పవన్‌ కృష్ణ, విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమలో తీవ్రమైన పోటీ ఉందని, దానిని అధిగమించడానికి బిహేవియర్‌ స్కిల్స్‌, టెక్నికల్‌ స్కిల్స్‌ , కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ను అభివద్ధి చేసుకోవాలని విద్యార్థులు కోరారు. టిసిఎస్‌ -అయాన్‌ జోనల్‌ అడ్మిన్‌ మేనేజర్‌ కె.గిరి మాట్లాడుతూ కలలు కని వాటిని సార్థకం చేసుకోనే దిశగా ప్రయత్నం చేసి విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ మజ్జి శశిభూషణరావు, అధ్యాపకులు, మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

అవయవదానంపై 'గురుదత్తా'లో అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

ప్రపంచ అవయవదాన వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం నగరంలోని గురుదత్తా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని గాంధీ బ్లడ్‌ డోనార్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. గమ్యం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు మాట్లాడుతూ మరో 8 మందికి పునర్జన్మను ఇవ్వడానికి అవయవ దానం దోహదపడుతుందన్నారు. ప్రతిఒక్కరిలో అవయవదానంపై అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. గాంధీ బ్లడ్‌ డోనార్స్‌ క్లబ్‌ వ్యవస్థాపకులు అబ్దుల్‌ రవూఫ్‌ మాట్లాడుతూ అవయవదానం ఉద్యమాన్ని విద్యార్థులు విస్తృత పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ గోపి, తదితరులు పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి అరుణశ్రీ

సిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌.అరుణశ్రీ గురువారం తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను సూపరింటెండెంట్‌ గేదెల శశిభూషణరావు, ఇతర వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. అనంతరం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వికలాంగుల హక్కులకు భంగం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్పలనాయుడు ఔదార్యం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన నాయకులు బుద్ద అప్పలనాయుడు ఔదార్యాన్ని చాటుకున్నారు. బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలకు బడి బస్సు నడపాలని సామాజిక కార్యకర్తలు రిక్కి అప్పారావు.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. దీంతో శృంగవరపుకోట ఆర్‌టిసి డిపో నుంచి బడి బస్సు నడిపేందుకు గురువారం డిపో మేనేజర్‌ రమేష్‌, మండల అధికారులు ఆ మార్గాన్ని పరిశీలించారు. దీంతో అప్పలనాయుడు కుమారుడు కృష్ణ స్పందించి జెసిబిని ఏర్పాటుచేసి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న డొంకలను, పిచ్చి మొక్కలను తొలగించారు. రోడ్డుపై గోతులు ఏర్పడిన చోట రాతిపిక్కను కూడా వేసి బడి బస్సు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- వేపాడ

వేపాడ పిహెచ్‌సిలో గురువారం గర్భిణులకు వైద్యాధికారి ధరణి, గైనకాలజిస్టు ఎస్‌.ఫణిశ్రీ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. సత్యసాయి ట్రస్టు ఏర్పాటుచేసిన భోజనాలను వారికి పంపిణీ చేశారు.

గ్రామ సందర్శనలో ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని రావాడ గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ చంద్రకళ, తహశీల్దార్‌ ఎం.సురేష్‌తో పాటు అధికారులకు గ్రామస్తులు సమస్యలపై ఫిర్యాదు చేశారు. చిన్న రావాడ రహదారి ఎన్నో ఏళ్ల నుంచి శిలాఫలకాలు వేస్తున్నారు తప్ప రహదారి మాత్రం వేయడం లేదని తెలిపారు. గ్రామంలో జల జీవన్‌ మిషన్‌ పనుల్లో భాగంగా ఇంటింటి కుళాయిలు అసంపూర్తిగా వదిలేశారన్నారు. గ్రామంలో ఎవరైనా గెడ్డలు ఆక్రమించి తప్పుడు సర్వే నెంబర్లు వేసి అమ్మకాలు చేపడితే తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్‌ అన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రం, ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకంతో పాటు విద్యార్థుల విద్యాసామర్థ్యాలను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఆదిబాబు, ఎంఇఒ రమణమూర్తి, సిడిపిఒ ఎస్తేరు రాణి, వైద్యాధికారి తిరుపతి స్వామి, గ్రామ సర్పంచ్‌ పైడినాయుడు, నాయకులు కర్రోతు సత్యనారాయణ, దంతులూరి సూర్యనారాయణరాజు, కర్రోతు రాజు తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ : విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జమదగ్ని

డెంకాడ: మండలంలోని ఢీకొల్లాంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పాఠశాల, అంగన్వాడి కేంద్రం, వెల్నెస్‌ సెంటర్‌ను అధికారులు పరిశీలించారు. ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, ప్రత్యేక అధికారి జమదగ్ని, ఎంపిడిఒ లవరాజ్‌, తహశీల్దార్‌ వి.పద్మావతి, సర్పంచ్‌ అట్టాడ శివకృష్ణ, నాయకులు రమణ, రమేష్‌, అప్పారావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ మంజూరు చేయాలి

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామ పంచాయతీలో గురువారం గ్రామ సందర్శనలో గ్రామం నుంచి పొలాలకు సిసి రోడ్డు, పాఠశాలకు కాంపౌండ్‌ వాల్‌, అంగన్‌వాడి నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు డిఆర్‌డిఎ పీడీ, మండల ప్రత్యేకాధికారి కళ్యాణ్‌ చక్రవర్తిని కోరారు. ముందుగా అంగన్వాడీ, పాఠశాలను పరిశీలించారు. గ్రామం నుంచి పంట పొలాలకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు. ఉన్నత పాఠశాలకు కాంపౌండ్‌ వాల్‌ లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాంపౌండ్‌ వాల్‌ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు అసిర్నాయుడు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్యామల కుమారి, ఎపిఎం గోవిందరావు, ఎపిఒ హరినాథ్‌, ఆర్‌డబ్ల్యుఎస్‌ జెఇ శ్రీ చరణ్‌, ఎంఇఒ ఎరకయ్య పాల్గొన్నారు.

దెందేరులో గ్రామ సందర్శన

కొత్తవలస : మండలంలోని దెందేరులో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం జరిగింది. మండల ప్రత్యేకాధికారి రామానందం, తహశీల్దార్‌ నీలకంఠరావు, ఎంపిడిఒ రమణయ్య.. ప్రాథమిక, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, పశువుల ఆస్పత్రిని సందర్శించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్లో మధ్యాహ్న భోజనం ఎలా ఉందోనని విద్యార్థులను ఆరాతీశారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల సామర్థ్యాన్ని చూసి అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీదేవి, సిడిపిఒ ఉమాదేవి, ఎపిఎం శ్రీను, ఎపిఒ జగన్నాథరావు, టిడిపి సీనియర్‌ నాయకులు లాలం అర్జున్‌రావు, దెందేరు సర్పంచ్‌ విరోతి వెంకటరమణ, ఎంపిటిసి వెలగల వెంకటరమణ, మాజీ సర్పంచ్‌ విరోతి శివాజీ, మాజీ ఎంపిటిసి నక్కరాజు చిన్న రాము పాల్గొన్నారు.


రేగిడి : దెందేరులో పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి


కొత్తవలస : విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ప్రత్యేకాధికారి రామానందం

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్‌ చక్రవర్తి

ప్రజాశక్తి- డెంకాడ

కళాశాలలో విద్యార్థులు ర్యాగింగ్‌ పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు బి.సాయి కళ్యాణ్‌ చక్రవర్తి అన్నారు. చింతలవలస మహారాజ ఇంజనీరింగ్‌ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ర్యాగింగ్‌ నిరోధిక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని వారికి హితవు పలికారు. ర్యాగింగ్‌కి పాల్పడి భవిష్యత్తులను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒకవేళ ర్యాగింగ్‌కి ఎవరైనా పాల్పడితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వాడినా, అమ్మిన, రవాణా చేసిన కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. అలాంటి వారికి బెయిలు కూడా దొరకడం చాలా కష్టమని శిక్షలు చాలా కఠినంగా ఉంటాయని చెప్పారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి విద్యార్థి హెల్మెట్‌ తప్పనిసరిగా వాడాలన్నారు. అనంతరం 52 మంది విద్యార్థులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి వకిల్‌ జిందాల్‌, సీనియర్‌ సివిల్‌ జడ్జ్‌ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి విజయ కళ్యాణి, ఇంజనీరింగ్‌ కాలేజ్‌ డైరెక్టర్‌ పివి సీతారామరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయి కల్యాణ్‌ చక్రవర్తి

నగర పంచాయతీలో ఆర్‌డి పర్యటన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో మున్సిపాల్‌ ప్రాంతీయ సంచాలకులు జి.నాగరాజు గురువారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, సచివాలయాల పనితీరుపై కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం అన్నా క్యాంటిన్‌ నిర్మాణ పనులు, మొయిద జంక్షన్‌ వద్ద ప్రధాన కాలువలో ఇది వరలో చేపట్టిన పూడిక తీత పనులు, 7వ వార్డు కీర్తి వీధిలో చేపట్టిన పూడిక తీత పనులను పరిశీలించారు. అక్కడ ప్రజలతో కాలువలలో చెత్తలను వేయరాదని, నగర పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనరు పి.బాలాజీ ప్రసాద్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ఇంచార్జ్‌ డి. ఉమా భాస్కర్‌, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న ఆర్‌డి జి.నాగరాజు


ఆర్‌విజికె రంగారావు సమాధివద్ద నివాళులర్పిస్తున్న బేబినాయ

ఘనంగా ఆర్‌విజికె రంగారావు జయంతి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయన తండ్రి ఆర్‌.వి.జి.కె రంగారావు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. షాదీఖానా ఎదురుగా ఉన్న ఆర్‌.వి.జి.కె రంగారావు సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు పెట్టి నివాళులర్పించారు. తన తండ్రి సామాజిక సేవ నేర్పారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా నిరతిని అలవర్చు కోవాలని కోరారు. తండ్రి బాటలోనే నడుస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

రెండో వార్డులో కమిషనర్‌ పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని రెండో వార్డులో గురువారం వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా కమిషనర్‌ ఎల్‌.రామలక్ష్మి పర్యటించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పౌష్టికాహారం ఏ విధంగా అందిస్తున్నది అడిగి తెలుసుకున్నారు. పళ్లెంవారి వీధిలో రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. దళితవాడలో తమ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తే ఇళ్లు నిర్మించుకుంటామని స్థానికులు తెలిపారు. వెంటనే కమిషనర్‌ స్పందిస్తూ హౌసింగ్‌ ఎఇతో మాట్లాడి, అర్హతను బట్టి రుణం మంజూరు చేయాలని ఆదేశించారు. సామాజిక మరుగుదొడ్ల వద్ద బోరు నిర్మించాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ కేంద్రం వద్ద అప్రోచ్‌ రోడ్డు వేయాలని, పబ్లిక్‌ కుళాయిలు నిర్మించాలని స్థానికులు కోరారు.

నేడు షాపుల వేలం పాట

విజయనగరం టౌన్‌ : నగరపాలక సంస్థ అధీనంలో ఉన్న షాపుల బహిరంగ వేలం శుక్రవారం ఉదయం 11 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతుందని కమిషనర్‌ ఎంఎం నాయుడు తెలిపారు. రాజీవ్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ వద్ద నూతనంగా నిర్మించిన 22 షాపులు, పాత, కొత్త ఐడిఎస్‌ఎంటి షాపింగ్‌ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల పాటదారులు బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

39 మందికి ముగ్గురే..

గ్రామాభివృద్ధి శిక్షణకు సర్పంచులు గైర్హాజరు

ప్రజాశక్తి- రేగిడి

ప్రజలచే ఎన్నుకోబడిన గ్రామస్థాయి సర్పంచులకు ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం అనుభవజ్ఞులైన పంచాయతీరాజ్‌ అధికారులతో శిక్షణలు ఇచ్చి అవగాహన కల్పించాలని ఉద్దేశంతో సదస్సులు నిర్వహిస్తుంటారు. ఈ శిక్షణలకు గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు గైర్హాజరు కావడంతో ఎవరికి శిక్షణ ఇచ్చేదని పలువురు పెదవిరుస్తున్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులు సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామపంచాయతీ అభివృద్ధిపై శిక్షణ ఇవ్వాలని అధికారులు భావించారు. 39 గ్రామ పంచాయతీల సర్పంచులకు కేవలం కొమిరి, చెలికానివలస, ఆర్‌ ఆముదాలవలస గ్రామపంచాయతీల సర్పంచులు మాత్రమే శిక్షణకు హాజరయ్యారు. మిగతా 36 మంది సర్పంచ్‌లు హాజరు కాకపోవడంతో అధికారులు, ప్రజలు పెదవి విరిస్తున్నారు. అప్పాపురం పంచాయతీ సర్పంచ్‌కు బదులు ఆమె భర్త కరణం శ్రీనివాసరావు, గుల్లపాడు పంచాయతీ సర్పంచ్‌కు బదులు ఆమె భర్త చక్రపాణి డమ్మీ సర్పంచులుగా హాజరయ్యారు. పారిశుధ్యం మెరుగు, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటు, తాగునీరు, గ్రామపంచాయతీ విధులు, నిధులు ఖర్చులు, జమలు నేర్చుకోవలసిన వారే గ్రామాభివృద్ధి శిక్షణకు హాజరు కాకపోవటం ఇదేనా ప్రజా ప్రతినిధులు తీరని విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులతోనే ఈ శిక్షణను ఇఒపిఆర్‌డి ఏవి.సత్యనారాయణ మమ అనిపించారు. శుక్ర, శనివారాలు జరుగు శిక్షణలకు అందరూ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నెల్లిమర్ల: గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి. రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి మూడు రోజుల పాటు రిఫ్రెష్‌ మెంట్‌ ట్రైనింగ్‌ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముగ్గురు ఎంఒటిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే వార్డు సందర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్‌

నగరంలోని 4వ డివిజన్‌ పూల్‌ బాగ్‌ ప్రాంతంలో వార్డు పర్యటనలో గురువారం నగరపాలక సంస్థ కమిషనర్‌ ఎంఎం నాయుడు పర్యటించారు. స్థానిక కార్పొరేటర్‌ మారోజు శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో ప్రధాన గెడ్డవాగు పూడికతీత పనులను పరిశీలించారు. దాదాపు 35 సంవత్సరాలుగా పూడికను తొలగించకుండా నిరుపయోగంగా ఉన్న వాగుకు జెసిబిల సహాయంతో భారీ ఎత్తున పూడిక తీత పనులు చేపట్టారు.ఈ ందర్భంగా పారిశుధ్య పర్యవేక్షకుడు రామకృష్ణను కమిషనర్‌ అభినందించారు. నిరుపయోగంగా ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాలు పెరిగిపోవడానికి చూసి సంబంధిత కార్యదర్శులపై మండిపడ్డారు. అనంతరం అంగన్వాడీ కేంద్రానికి చేరుకొని అక్కడ పిల్లలకు అందుతున్న విద్య, నైపుణ్య శిక్షణ పరిశీలించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్‌ సిహెచ్‌ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్‌ కొండపల్లి సాంబమూర్తి, వివిధ విభాగాల అధికారులు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్‌ నాయుడు

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని, మంచి సంస్కారాన్ని పెంపొందించుకోవాలని జూనియర్‌ సివిల్‌ జడ్జి సబ్బవరపు వాణి సూచించారు. స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాటయ అవగాహనా సదస్సును నిర్వహించారు. మత్తు మందులు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలు, శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలపరిమితి దాటిన మందులు, ఔషధాలు కూడా డ్రగ్స్‌ కిందకే వస్తాయని, మితిమీరి ఏ మందును వాడినా వారిని డ్రగ్‌ అడిక్ట్‌ అనే అంటారన్నారు. ఉన్నత చదువులకు పట్టణాలకు వెళ్లే విద్యార్థులు తమకు తెలియకుండానే చెడు స్నేహితుల ద్వారా మాదక ద్రవ్యాలకు అలవాటుపడి వాటికి బానిసలుగా మారే ప్రమాదముందన్నారు. ఆర్థిక ప్రయోజనాలను ఎరగా చూపి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు ప్రలోభపెట్టే అవకాశముందన్నారు. ఇటువంటి నేరాలకు బెయిల్‌ కూడా అనుమతించబడదన్నారు. యువత ఆత్మవిశ్వాసాన్ని, మంచి సంస్కారాన్ని పెంపొందించుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు జి.సూరిదేముడు, ఎజిపి అల్లు సత్యాజీ, సీనియర్‌ న్యాయవాది గేదెల ప్రకాశరావు మాట్లాడారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ కార్యదర్శి బి.సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్‌ చింతాడ సునీల్‌, న్యాయవాదులు వారాధి ఈశ్వరరావు, రావాడ సత్యనారాయణ, భూమిరెడ్డి రామారావు, టి.వెంకటరమణ, బొబ్బిలి రామకృష్ణ, బి.వెంకటరావు, పి.సంతోష్‌ పాల్గొన్నారు.

చీపురుపల్లిలో ఐసిఐసిఐ బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఐసిఐసిఐ బ్యాంక్‌ కొత్తగా చీపురుపల్లి డివిజన్‌లో తమ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసింది. రాధికా గ్రూప్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ మానవేంద్ర మోర్‌ గురువారం ఈ శాఖను ప్రారంభించారు. ఈ డివిజన్‌లో బ్యాంకునకు ఇది తొలి బ్రాంచ్‌ కాగా జిల్లాలో అయిదోదని, ఈ బ్రాంచ్‌లో ఎటిఎం కూడా ఉంటుందని బ్యాంకు రీజినల్‌ ప్రతినిధి చెప్పారు. సేవింగ్స్‌, కరెంట్‌ అకౌంట్స్‌, ఫిక్సిడ్‌ రికరింగ్‌ డిపాజిట్లు వంటి ఖాతాలు, డిపాజిట్లతో పాటు వ్యాపార రుణం, గృహ రుణం, వ్యక్తిగత రుణం, వాహన రుణం, విద్యా రుణం తదితర రుణాలు అందిస్తుందని తెలిపారు. ప్రాంగణంలో లాకర్‌ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఉద్యోగి ట్యాబ్లెట్‌ డివైజ్‌ ద్వారా కస్టమరు ఉన్న చోటే దాదాపు 100 సర్వీసులను అందించడానికి వీలు కల్పించే ట్యాబ్‌ బ్యాంకింగ్‌ సదుపాయాన్ని కూడా ఈ శాఖ అందిస్తుందని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని, వినియోగించుకోవాలని కోరారు.

తనిఖీలకే పరిమితం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని చామలాపల్లిలో గురువారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమం తనిఖీలకే పరిమితమైంది. ముందుగా పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి, గ్రామ సందర్శన వల్ల కలిగే ప్రయోజనాలను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ వివరించారు. అనంతరం పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం వెంకయ్యపాలెం, పోతుబందిపాలెంలో పర్యటించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నిశ్చల, సర్పంచ్‌ కోలా సతీష్‌, పంచాయతీ కార్యదర్శి భారతి, అధికారులు పాల్గొన్నారు.

పక్షం వ్యవధిలోనే

తండ్రి, కొడుకు ఆత్మహత్య

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలోని ముచ్చర్లవలస గ్రామంలో పక్షం రోజుల వ్యవధిలోనే కొడుకు, తండ్రి ఆత్మహత్య చేసుకొని తనువులు చాలించడం సంచలనం రేపింది. గత నెల 24న నడగాన సురేష్‌ (24) ఉరివేసుకొని మృతిచెందాడు. ఆయన తండ్రి నడగాన రమణ (55) బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ జ్ఞానప్రసాద్‌ కథనం ప్రకారం... పొలంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో రవణను బంధువులు హుటాహుటిన బాడంగి సిహెచ్‌సికి తరలించారు. అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో అప్పటి నుంచి మనస్తాపంతో ప్రతిరోజూ బాధపడుతూ అన్న, పానీయాలు తీసుకోకుండా బలవర్మరణానికి పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడు రవణ ఒక హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. రవణ భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న రమణ